ప్రజాశక్తి
శనివారం 14 జనవరి 2023
5
అనంతపురం





మాట్లాడుతున్న రిటైర్డ్ తహశీల్దార్ శీలా జయరామప్ప

పేదలందరికీ భూములు ఇవ్వాలి

రిటైర్డ్ తహశీల్దార్ జయరామప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అర్హులైన పేదలందరికీ సాగు భూములు ఇవ్వాలని రిటైర్డ్ తహశీల్దార్, పెన్షనర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి రైతుసంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గణేనాయక్ భవన్‌లో సాగు భూముల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు రిటైర్డ్ తహశీల్దార్ జయరామప్ప, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శ వి.శివారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమి మనిషికి ఆత్మగౌరవాన్ని, సమాజంలో గుర్తింపును ఇస్తుందన్నారు. ఏళ్లు గడుస్తున్నా పేదలకు భూమి అందని ద్రాక్షలాగా ఉందన్నారు. పేదలకు సాగు భూమి ఇవ్వడం కోసం, ఇచ్చిన దానిని రక్షించేందుకు అనేక మంది పోరాట ఫలితంగా వచ్చిన చట్టమే 9/77 అస్సైన్‌మెంట్ చట్టం అన్నారు. ఈ చట్టం కొంత రక్షణగా ఉండేదని, 2007లో సవరించి 8/2007 తీసుకొచ్చారని తెలిపారు. దీని వల్ల ఎన్‌ఒసి ఇచ్చేందుకు, అన్యాక్రాంతం అయిన భూమిని స్వాధీనం చేసుకుని పాత పట్టాదారునికే గాని, అర్హులైన అదే గ్రామానికి చెందిన వారికి గాని, ప్రజా ప్రయోజనం కోసంమైన తీసుకునే అధికారం ఉందన్నారు. అప్పటి నుంచి పేదల భూములను ఆక్రమించుకోవడం పెరిగిందన్నారు. భూముల విలువ పెరిగే కొద్దీ సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ వెబ్ ల్యాండ్ రావడం వల్ల పట్టాదారుల పేర్లను, సాగులేని వారి పేర్లను చేర్చడం, నిజంగా సాగులో ఉన్న వారిని చేర్చక పోవడం వల్ల సాగులో ఉన్నప్పటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. కొన్ని మండలాల్లో సాగులో ఉన్నట్లు నమోదుకు సర్వే అధికారులు రావడం లేదన్నారు. వచ్చిన చోట కాలంలో ఎఫ్ఎంబిలు ఇవ్వకపోవడం వల్ల పట్టాలు రావడం లేదన్నారు. సాగు దారులందరూ ఐక్యంగా ఉద్యమిస్తే తప్పా సాధించుకోలేరన్నారు. కూడేరు మండల కేంద్రంలో 535 సర్వేలో వివిధ పంటలు పెడుతూ, బోర్లు వేసుకుని 30 ఏళ్లుగా సాగులో ఉన్నప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదన్నారు. కూడేరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, శింగనమల, పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి సాగు దారులు హాజరయ్యారు. సాగుదారుల భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 19, 20 తేదీల్లో సచివాయాల అధికారులకు అర్జీలు, 23వ తేదిన తహశీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేయడం, నెలాఖరున కలెక్టరేట్ ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు సదస్సు తీర్మానించింది. ప్రభుత్వం వెంటనే స్పందించాలని సాగు దారులందరికి పట్టాలు ఇవ్వాలని కోరారు.

సాగు భూముల సాధన పోరాట కమిటీ ఎన్నిక

సమావేశంలో సాగు భూముల సాధన పోరాట కమిటీని 29 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎం.క్రిష్ణమూర్తి, కో కన్వీనర్‌గా వి.శివారెడ్డిలు ఎన్నిక అయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భాస్కర్, రాముడు, నాగమ్మ, ఇల్లూరు నల్లప్ప, ఓబిలేసు పాల్గొన్నారు.

అన్నీ చేస్తున్నారట..!

◆ కౌలు రైతుల సాయంపై అధికారుల బుకాయింపు ◆ గణాంకాలు చూపడంలో గోప్యత



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కౌలు రైతులకు గుర్తింపు లేదన్న ప్రజాశక్తి కథనం అవాస్తమంటూ అనంతపురం, సత్యసాయి జిల్లా వ్యవసాయాధికారుల రిజాండర్ ఇచ్చారు. కౌలు రైతులకు గుర్తింపునిస్తున్నామని, పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు అన్ని రకాలుగా అందుతున్నట్లు శుక్రవారం నాడు వివరణిచ్చారు. అయితే ఎంత మందికిచ్చారు.? ఎక్కడిచ్చారన్న వివరణ మాత్రం ఇవ్వకుండా అన్నీ చేసామంటూ బుకాయింపుతోనే సరిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

గతేడాది ఇచ్చినకార్డులనూ కలిపి ఎక్కువ చూపించే ప్రయత్నం

2022-23 సంవత్సరానిగానూ అనంతపురం జిల్లాలో 2657 సిసిఆర్‌సి కార్డులిచ్చినట్టు ఈనెల 7వ తేదీన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులకు ఇచ్చిన నివేదికల్లోనూ చూపించారు. అయితే వివరణలో మాత్రం 7500 సిసిఆర్‌సి కార్డులిచ్చామని ప్రకటించారు. వాస్తవానికి ఈ లెక్కలు ఈ ఏడాదికి సంబంధించినవి కావు. 2019వ సంవత్సరం నుంచి ఇచ్చిన సిసిఆర్‌సి కార్డులన్నింటినీ కలిపి ఈ ఏడాది 7500 కార్డులిచ్చినట్టు వివరణలో పేర్కొనడం గమనార్హం. కౌలు గుర్తింపు కార్డులు ఒక్క ఏడాది కాల పరిమితితోనే ఇస్తారు. మరో ఏడాది పొడిగించాల్సి ఉంటే రెన్యూవల్స్ చేయాల్సి ఉంటుంది. రెన్యూవల్స్ చేసిన గణాంకాలేవి అధికారుల వద్ద లేవు. పాతలెక్కలను అన్నీ కలిపి మొత్తం 7500 ఇచ్చినట్టు చెబుతున్నారు. ఇందులో ఎంత మంది ఉన్నారో లేదో అన్న వెరిఫికేషన్ కూడా చేయలేదు.

ఒక్కరీ అందని పంటరుణం

గుర్తింపు పొందిన కౌలు రైతులకు 2022-23 సంవత్సరంలో అనంతపురం జిల్లాలో ఒక్కరీ పంటరుణమివ్వలేదు. అయితే అధికారులు మాత్రం పంటరుణాలిచ్చినట్టు వివరణలో పేర్కొన్నారు. నేరుగా పంటరుణాలివ్వడంలో సమస్య ఉందని జెఎల్‌జి (జాయింట్ లయబుల్ గ్రూపు) ద్వారా ఇస్తుంటారు. నలుగరు, ఐదుగురు కౌలు రైతులకు కలిపి ఒక గ్రూపుగా తయారు చేస్తారు. ఈ గ్రూపునకు రుణమిస్తారు. ఈ రకంగా చూసుకున్నా రైతులకు ఇచ్చింది పిసరంతే. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఒక గ్రూపునకు రూ.1.15 లక్షలు మాత్రమే ఇచ్చారు. దీన్నే అధికారులు జిల్లాలోని కౌలు రైతులందరికీ రుణాలిచ్చినట్టు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి.

అందని పరిహారం

కౌలు రైతులకు పంటనష్టపోతే ఒక్క రైతుకు పరిహారం అందిన దాఖలాల్లేవు. ఉదాహరణకు విడపనకల్లు మండలంలోని ఆర్‌కొట్టాల గ్రామం పరిధిలో అత్యధికంగా కౌలు రైతులున్నారు. ఈ గ్రామంలో 2021లో అధిక వర్షాలకు మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. కాని ఒక్క రైతుకు పరిహారం అందిన దాఖలాల్లేవు. అదే రకంగా వజ్రకరువూరు మండలంలోని పొట్టిపాడులోనూ మిర్చి రైతులు నష్టపోయారు. వారికి పరిహారం అందలేదు. ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామంలో 42 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులూ ఇచ్చారు. వీరిలోనూ ఎవ్వరికి పరహారం అందలేదు. కనీసం సబ్సిడీ విత్తనాలు సైతం అందిన దాఖలాల్లేవు. కాని అధికారులు మాత్రం కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నట్టు వివరణివ్వడం గమనార్హం. 2021 సంవత్సరంలో మాత్రమే సబ్సిడీ విత్తనమిచ్చారు. 2022 ఖరీఫ్‌లోగాని, రబీలోగాని జిల్లాలో ఒక్క కౌలు రైతుకు సబ్సిడీ విత్తనమివ్వలేదు.



విశ్రాంత ఉద్యోగులకు పథకాల గురించి వివరిస్తున్న మేనేజర్ మురళీకృష్ణ

విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సేవలు

కళ్యాణదుర్గం : గ్రామీణ బ్యాంకు ద్వారా విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు సర్కిల్ మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానిక విశ్రాంతి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల కోసం గ్రామీణ బ్యాంకు డిపాజిట్లపై అధిక వడ్డీరేట్లు అందజేస్తోందన్నారు. సీనియర్ సిటిజన్లకు 400 రోజులకు 7.35 శాతం, 666 రోజులకు 7.75 శాతం వడ్డీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు శివప్రసాద్, తిప్పేస్వామి, నాగరాజు, అంజినప్ప, సీసీ రెడ్డి, పాండురంగ, నరసింహులు, రామాంజినేయులు, వన్నూరుస్వామి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫైనల్ పోటీలకు హాజరుకానున్న ఎస్పీ ఫక్కీరప్ప

రాయదుర్గం : రాయదుర్గం యూత్ స్పోర్ట్స్ లీగ్ (అర్‌వైఎస్ఎల్) నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా శనివారం జరగనున్న ఫైనల్ పోటీలకు ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ఆర్‌వైఎస్ఎల్ నిర్వహిస్తున్న క్రికెట్, హాకీ, వాలీబాల్ మొదలైన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విజేతలకు ఎస్పీ ఆర్‌వైఎస్ఎల్ తరపున బహుమతులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బందనాథం సూర్యప్రకాష్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రస్థాయి హాకీ జటుకు ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో నేటి నుంచి 16వతేదీ వరకు జరిగే 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీలలో పాల్గొనే సత్యసాయి జిల్లా జూనియర్ బాలుర హాకీ జటుకు ఆశోక్ (కెప్టెన్), రాజేశ్, లోకేశ్, ఈశ్వర్, మహమ్మద్ రఫీ, వెంకటేశ్ నాయక్, ప్రశాంత్ బాబు, వంశీ, మహబూబ్‌బాషా, జగన్, రపేస్, చక్రిరవితేజ, సునీల్, మహేష్, లావణ్యకుమార్, నాయక్, శుబాష్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ జట్టుకు కోచ్‌గా హుస్సేన్, మేనేజర్ కుషాల్‌కుమార్ వ్యవహరిస్తారన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలు

రాయదుర్గం : పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీదేవి పంచమ జ్యోతుల ఉత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా ఆలయం వద్ద నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో చౌడేశ్వరి కలశం, పంచమ జ్యోతుల ఉత్సవం కొనసాగింది. ప్రధాన కూడళ్లలో చౌడేశ్వరి పాటలు, భజనలు, కలశ, జ్యోతుల నత్యంతో ఊరేగింపు సాగింది. అదేవిధంగా చౌడేశ్వరి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమాలలో విప్ కాపు రామచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.



జ్యోతులు ఆడుతున్న భక్తులు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటిఎఫ్, ఎస్‌టియు, ఇతర ప్రజా సంఘాలు బలపరిచిన రాయలసీమ పట్ట భద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో రాజ్యాంగ విలువలు, ప్రజాతంత్ర హక్కులను కాపాడుకుందాం అనే అంశంపై యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, లౌకిక విధానం ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. ప్రజాతంత్ర హక్కులు, ప్రశ్నించే తత్వం స్వేచ్ఛగా ప్రదర్శనలు చేయకుండా నిషేధం, సాధారణ నిరసనలను సైతం తెలియజేసే ప్రజాస్వామ్య వాతావరణం కూడా లేని పరిస్థితులు నేటి ప్రభుత్వ పాలకులు తెచ్చిపెట్టారని తెలిపారు. ప్రజాతంత్ర హక్కులని కాపాడుకోవడం కోసం పీడీఎఫ్, యూటిఎఫ్, ప్రజా సంఘాలు నిలబెట్టిన పశ్చిమ రాయలసీమ టీచర్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి పోతుల నాగరాజులకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని తెలియజేశారు. రాష్ట్రంలో విద్యా రంగంలో సంస్కరణల పేరుతో పాఠశాలలు విలీనం, ఉపాధ్యాయుల సంఖ్యని కుదించడం లాంటి చర్యలను ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. సంస్కరణలు అభివద్ధికి ఉపయోగపడాలి తప్పా, విద్యా విధానం పతనంకు కారణం కాకూడదన్నారు. పాదయాత్ర సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ రూ.1848 కోట్లు బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహరెడ్డి, పోతుల నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యల పరిష్కరించడానికి తమవంతు కషి చేస్తామన్నారు.



ప్రజాతంత్ర హక్కులను కాపాడుకుందాం అంశంపై కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎన్నికల్లో తమను గెలిపించి ఆదరించాలని కోరారు. యూటిఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మున్సిపల్ ప్రదానోపాధ్యాయులకు డిడిఒ పవర్స్ ఇవ్వాలని కోరారు. యుటీఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతగా పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజా పక్షమై ఉంటారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వీరికి మద్దతు ఇచ్చి, అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజా తంత్ర ఉద్యమాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెవివి నాయకులు ఆదిశేషులు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భూతన్న, సహాధ్యక్షులు జిహెచ్.బాబు, కోశాధికారి ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శులు సి.తాహెర్ వలి, డి.శ్రీనివాసులు, ఈ.నారాయణ స్వామి, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.ఆంజినేయులు, రామకృష్ణ నాయక్ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఇన్‌ఛార్జి డిఇఒగా క్రిష్ణయ్య

ప్రజాశక్తి-అనంతపురంసిటీ



ఇన్‌ఛార్జి డిఇఒ క్రిష్ణయ్య

ప్రాంతీయ విద్యాశాఖ అధికారి, అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి డీఈవో ఎం.వెంకట క్రిష్ణారెడ్డి మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్థానంలో అనంతపురం డీఈవో ఆఫీసులో ఏడీగా పనిచేస్తున్న క్రిష్ణయ్యను ఇన్‌ఛార్జి డిఒగా నియమించారు. గతంలో ఇక్కడ రెగ్యులర్ డిఇఒగా పనిచేస్తున్న కె.శామ్యూల్ 70 రోజుల క్రితం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప ఆర్జేడీగా పనిచేస్తున్న ఎం.వెంకట కృష్ణారెడ్డికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. గత ఎడాది నవంబర్ 4న ఇన్‌ఛార్జి డిఇగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జిగా డిఇఒగా ఏడీ క్రిష్ణయ్య బాధ్యతలు చూడనున్నారు.

యోగాలో ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్‌గా ఖ్యాతిరెడ్డి



ప్రతిభ కనబరిచిన ఖ్యాతిరెడ్డి

గుత్తి : యోగాసన పోటీల్లో గుత్తిలోని ఆర్కే ఉచిత యోగా కేంద్రానికి చెందిన విద్యార్థిని ఖ్యాతిరెడ్డి ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్‌గా టైటిల్ దక్కించుకుంది. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని అనంతపురం నగరంలో వివేకానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో 2022లో రాష్ట్ర, జాతీయ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఖ్యాతిరెడ్డి ఉత్తమ ప్రతిభ చూపి టైటిల్‌ను సాధించుకుంది. అండర్ 14 బాలికల విభాగంలో ఖ్యాతిరెడ్డి బంగారు పతకం, అండర్ 17 బాలుర విభాగంలో అఖిలసాయి రెడ్డి బంగారు పతకం సాధించినట్లు ఆర్కే ఉచిత యోగ కేంద్రం నిర్వాహకులు రామకృష్ణారావు తెలిపారు. పోటీల నిర్వాహకులు విజేతలకు మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు.

'పురం'లో కొట్టుకున్న కౌన్సిలర్లు

నడిరోడ్డుపై అధికార పార్టీ నేతల బాహాబాహి
హిందూపురంలో రచ్చకెక్కిన విభేదాలు
ఇంటి నిర్మాణ విషయంలో ఘర్షణ
ఛైర్‌పర్సన్‌పై అసమ్మతి కౌన్సిలర్ల దురుసు ప్రవర్తన



బాహాబాహీకి దిగిన వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం అధికార పార్టీలో అసమ్మతి మరోసారి రచ్చకెక్కింది. ఈ సారి ఏకంగా ఆ పార్టీ కౌన్సిలర్లు నడిరోడ్డుపై ఒకరిపై ఒకరు బాహాబాహికి దిగారు. ఓ ఇంటి నిర్మాణ విషయంలో అందరూ చూస్తుండగానే రోడ్డుపై ఇద్దరు నేతలు తన్నుకున్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఈ ఘటనలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసు స్టేషన్‌లోనూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

హిందూపురం పట్టణంలోని బుక్కడిపేట 5వ వార్డుకు చెందిన ఇర్షాద్ అహ్మద్ 29వ వార్డులో ఓ ఇంటిని నిర్మాణం చేస్తున్నారు. ఈయన మూడు అడుగుల రోడ్డును ఆక్రమించుకుని ఇల్లు నిర్మిస్తున్నారని అధికార పార్టీకి చెందిన 29వ వార్డు కౌన్సిలర్ రోషన్ అలీ మున్సిపల్ అధికారులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఛైర్‌పర్సన్ ఇంద్రజ పరిశీలన చేసి నిజంగా ఆక్రమణ జరిగి ఉంటే తొలగించాలని అధికారులకు సూచించారు. దీంతో అధికారులు పరిశీలన చేసి ఆక్రమణ జరిగిందని నిర్ధారణ చేశారు. ఈ మేరకు ఆక్రమణల తొలగింపునకు శుక్రవారం జెసిబిలను తీసుకుని తొలగించడానికి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసుల సహాయంతో ఆ ప్రాంతానికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న 5వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్ అక్కడికి చేరుకున్నారు. 29వ వార్డు కౌన్సిలర్ రోషన్ అలీ రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తే లేని అభ్యంతరం ఇతరులకు ఎందుకు వర్తిస్తుందని అధికారులను ప్రశ్నించారు. కాలనీల్లో అన్ని ఇళ్లు ఎక్కడి వరకు ఉన్నాయో ప్రస్తుతం నిర్మాణం అవుతున్నా ఇల్లు కూడా అక్కడే ఉందని పేర్కొన్నారు. ఇలా ఈ విషయంపై ఇద్దరు కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు పెద్ద ఎత్తున దూషణలు చేసుకున్నారు. ఇది కాస్త పెరిగి ఒకరిపై ఒకరు భౌతికంగా దాడులు చేసుకున్నారు. నడిరోడ్డుపైనే ఇద్దరు కొట్టుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు కలగజేసుకుని ఇద్దరికీ సర్ధిచెప్పడంతో అప్పటికి గొడవ సద్దుమణిగింది.

ఛైర్‌పర్సన్ ఛాంబర్ వదద ఆందోళన

ఇర్షాద్ అహ్మద్‌కు మద్దతుగా పదిమంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ఛాంబర్ వద్దకెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పార్టీ కౌన్సిలర్ ఇల్లు నిర్మాణం చేసుకుంటుండగా, నిర్మాణాన్ని కూల్చడానికి జెసిబి పంపడం ఏమిటని ఛైర్‌పర్సన్‌ను నిలదీశారు. సమస్య ఉంటే ఇద్దరు కౌన్సిలర్లను పిలిపించి మాట్లాడాల్సింది పోయి ఇలా కక్షలు రేపే విధంగా ఇల్లు కూల్చడానికి జెసిబిలను పంపడం ఏమిటని ప్రశ్నించారు. ఇదే క్రమంలో కౌన్సిలర్ శివ, ఛైర్‌పర్సన్ ఇంద్రజ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కౌన్సిలర్ శివ తనను ఏకవచనంతో మాట్లాడి అగౌరవపరిచారంటూ ఛైర్‌పర్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆమె అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాగా ఛైర్‌పర్సన్‌పై దూషణల విషయాన్ని తెలుసుకున్న ఆమె భర్త తన మద్దతుదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చారు. అక్కడున్న అసమ్మతి వర్గం కౌన్సిలర్లతో వాదనకు దిగారు. మహిళ అని చూడకుండా ఎలా అవమానకంగా మాట్లాడతారంటూ కౌన్సిలర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఛైర్‌పర్సన్‌ను దురుసుగా మాట్లాడే లేదని, ఇంటి నిర్మాణ విషయంపై మాత్రమే ప్రశ్నించామని అసమ్మతి కౌన్సిలర్లు సమాధానం ఇచ్చారు. అధికార పార్టీలో ఉంటూ బెదిరించాలని చూస్తే తమకు కౌన్సిలర్ పదవులే అవసరం లేదని అసమ్మతి కౌన్సిలర్లు పేర్కొన్నారు. వెంటనే పదవులకు రాజీనామా చేస్తామని 15 మంది కౌన్సిలరు ప్రకటించారు. ఈ వాదనల నడుమ ఛైర్‌పర్సన్ భర్త అక్కడినుంచి వెళ్లి పోయారు.

పోలీసు స్టేషన్‌కు పంచాయతీ

అధికార పార్టీ నేతల బాహాబాహి వ్యవహారం పోలీసు స్టేషన్‌కు చేరింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలర్ శివపై ఫిర్యాదు చేశారు. తన ఛాంబర్లోనే తనను ఇష్టారాజ్యంగా మాట్లాడటంతో పాటు దురుసుగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఛైర్‌పర్సన్ కేసు పెట్టారన్న విషయం తెలుసుకున్న అసమ్మతి వర్గం కౌన్సిలర్లు అంతా స్టేషన్‌కు చేరుకున్నారు. ఛైర్‌పర్సన్ భర్త అనుచరులతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బెదిరింపులకు దిగారని, తమ వర్గీయుడు నవీన్‌ను దూషించారని ఫిర్యాదు చేశారు. పోలీసులు రెండు వర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కాగ ఈ వ్యవహారం వైసిపి పరిశీలకుడు రెడ్డి ఈశ్వరరెడ్డి నాయకులతో మాట్లాడినట్లు సమచారం. అధిష్టానం దీనిపై ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పండగ పూటా కార్మికులకు పస్తులా..?

ప్రజాశక్తి-గుంతకల్లు

స్వచ్ఛభారత్ కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలను ఇవ్వకుండా పండగ పూట కూడా పస్తులు పెడతారా అంటూ సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వచ్ఛభారత్ కార్మికులతో పనులు చేయించుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి పది నెలలుగా జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. పనులు చేస్తూ పండగ పూట కూడా వారు పస్తులతో గడపాలా అని ప్రశ్నించారు. పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలుచేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం దారుణం అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్మికులు నాగన్న, ఆంజనేయులు, కదిరప్ప, ఖాసీం, శివన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి

టీచర్ల సర్దుబాటు ప్రశాంతం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్జీటీలుగా పనిచేస్తున్న టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను నగరంలోని జిల్లా సైన్స్ సెంటర్లో శుక్రవారం నిర్వహించారు. ఆర్జెడి/ డీఈవో ఎం.వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 704 మంది ఎస్జీటీలకు హైస్కూల్‌లో ఖాళీగా ఉన్న ఆయా సబ్జెక్టులలోకి తాత్కాలికంగా సర్దుబాటు చేసినట్లు ఆర్‌జెడి తెలిపారు. ఈ ప్రక్రియ జరిగిందని, సర్దుబాటు అయిన టీచర్లు అందరూ ఈనెల 18వ తేదీ వీధుల్లో జాయిన్ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పద్మప్రియ, శంకరప్రసాద్, రంగస్వామి, మీనాక్షి, ఏడీ కిష్టయ్య, పర్యవేక్షకులు ఆదినారాయణ, శ్రీనాథ్, సరళ, హెచ్ఎం జయచంద్ర, డీఈవో ఆఫీస్ ఏపీవో నాగరాజు, సమగ్ర శిక్ష ఎఎస్ఒ గురు మునికృష్ణ, ఎపిఒ నారాయణస్వామి, డిఇఒ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి సిఐటియు అఖిల భారత మహాసభలు

పోస్టర్ల ఆవిష్కరణలో జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేది వరకు నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత 17వ మహాసభలు జయప్రదం చేద్దామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లోని సిఐటియు కార్యాలయంలో మహాసభల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహా సభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల పట్ల సమీక్ష చేసి భవిష్యత్ పోరాట కార్యాచరణను మహాసభ రూపొందించనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదల, గ్రీన్ ట్యాక్స్‌లతో సంక్షోభంలో వున్న రవాణా రంగంపై అదనపు భారం మోపిందన్నారు. త్రైమాసిక రోడ్ ట్యాక్స్‌ను భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ భారం సగటున 30 శాతం పైనే ఉందన్నారు. అయితే వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లు ట్రాలీలకు గతంలో మాదిరే ఇప్పుడు కూడా మినహాయింపును కొనసాగించారని తెలిపారు. ఆరు టైర్ల లారీలకు గతంలో రూ.3,940లుగా వున్న రోడ్ ట్యాక్స్‌ను రూ.4,970లకు పెంచిందన్నారు. 10 టైర్ల లారీకి రూ.6,580లు వుంటే రూ.8,390లకు పెంచారని తెలిపారు. 12 టైర్ల లారీకి రూ 8,520ల నుంచి రూ10,910లకు, 14 టైర్ల లారీకి రూ.10,480ల నుంచి రూ.13,430లకు పెంచారని తెలిపారు. సరుకు రవాణాకు ఉపయోగించే త్రీవీలర్స్‌పై కూడా భారీగా పన్నును పెంచారన్నారు. పర్మిట్లపై కూడా పెంపుదల చేశారన్నారు. అన్ని రకాల ధరలు ప్రజలకు తీవ్ర ఆటంకంగా మారిపోయాయని తెలిపారు. కరోనా నుంచి కోలుకోక మునుపే భారాలు మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇలాంటి విధానాలు ప్రభుత్వాలు వీడాలన్నారు. భారాలు ఉపసంహరించుకునేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు, నగర కార్యదర్శి వెంకటనారాయణ, ప్రభాకర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.


జిఒ ప్రతులు దహనం చేస్తున్న దృశ్యం

పెంచిన రోడ్డు ట్యాక్స్ ఉపసంహరించాలి
జిఒ ప్రతులు దహనం

రవాణా రంగంలో వాహనాలపై భారాలు మోపేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒను తక్షణమే ఉపసంహరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, గూడ్స్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు నగర కమిటీ, గూడ్స్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద సంక్రాంతి బోగి మంటల్లో జిఒ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రైమాసిక పన్నులు 30 శాతం పెంపుదల చేసిందన్నారు. వాహన రంగం కోలుకోలేని విధంగా ప్రభుత్వం పన్నులు విధిస్తోందన్నారు. త్రైమాసిక టాక్స్ ఉపసంహరించాలని లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు శీనా, నాగరాజు, హరి, లింగారెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు శివ, వరద గోపాల్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నమూనా కానిస్టేబుల్ పరీక్షని సద్వినియోగం చేసుకోండి


పోస్టర్లు విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జనవరి 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నమూనా కానిస్టేబుల్ పరీక్షలు అభ్యర్థులందరూ రాసి సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన నమూనా కానిస్టేబుల్ పరీక్షల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇటువంటి ప్రతిభా, నమూనా పరీక్షలు అభ్యర్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకత్వానికి అభినందనలు తెలిపారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షల నిపుణులు ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నమూనా ప్రశ్న పత్రాలు తయారు చేశారని తెలిపారు. పరీక్ష రుసుము రూ.100 మాత్రమే అన్నారు. జనవరి 18న మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుందన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే నమూనా పరీక్షలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులందరూ 9618062490, 9182216213 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చరణ్, అఖిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

ఉరవకొండ : సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఉరవకొండ పట్టణంలో శ్రీ సత్యసాయి బాలవికాస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. శుక్రవారం శ్రీ సత్యసాయి గురుచరణ భజన మందిరం ప్రాంగణంలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో బాలవికాస్ విద్యార్థులు పాల్గొని రంగవల్లులు వేశారు. పోటీల నిర్వహణలో బాలవికాస్ గురువులు కె.విజయ్ ప్రభ, యశ్వంత్, రూపేష్ సాయి, యూత్ కోఆర్డినేటర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ రోజూ కార్మికులకు పస్తులేనా..?

వేతనాలు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇకి వినతి



ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సంక్రాంతి పండుగ రోజున శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మిక కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితిని ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా చేయడం అన్యాయంగా ఉందని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు అన్నారు. పండుగ రోజు తద్దినమా.. అంటూ ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని అనేక రూపాల్లో పోరాటం నిర్వహిస్తున్న ప్రభుత్వంలో చలనం లేకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. హిందూపురం ప్రాజెక్ట్‌లో 6 నెలలు, డ్యామ్, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో 1 నెల వేతనాలు బకాయి ఉన్నాయని తెలిపారు. కనగానిపల్లి, రామగిరిలో 14 నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. శ్రీసత్యసాయి ప్రాజెక్ట్‌లో 5 నెలల వేతనాలు బకాయి ఉన్నాయని తెలిపారు. పిఎఫ్ సంవత్సరాల తరబడి బకాయి ఉందన్నారు. ఇఎస్ఐ అమలు కాకపోవడంతో కార్మికుల కుటుంబాలకు జబ్బులు, ప్రమాదాలు జరిగితే దిక్కులేని పరిస్థితి ఉందన్నారు. కాంట్రాక్టర్‌లు మాత్రం నెలల కొద్దీ బిల్లులు అప్‌లోడ్ కావడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు రాముడు, నాగరాజు, ఎం.నాగరాజు, వన్నూరుస్వామి, సంజప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికె కేంద్రాలు దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఉరవకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ మూడున్నరేళ్లలో వ్యవసాయం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. శుక్రవారం ఉరవకొండ మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వ్యవసాయ శాఖ జెడిఎ చంద్రనాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యవసాయ సమస్యలు పరిష్కరించడం కోసమే ప్రతి నెలా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్ వేగవంతంగా చేపట్టి ప్రభుత్వం అందించే అన్ని రకాల పథకాలు రైతులకు అందేలా కృషి చేయాలన్నారు. పిఎం కిసాన్ ఈ కేవైసీ ఈనెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో ఇన్సూరెన్స్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఒక సీజన్‌లో నష్టం జరిగితే మరుసటి ఏడాది అదే సీజన్ రాకమునుపే ఇన్సూరెన్స్ సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లోకి వచ్చే గొప్ప మార్పును జగన్ తెచ్చాడన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇన్సూరెన్స్ విధానంతో గత ఏడాది ఉరవకొండ నియోజవర్గం రైతులకే రూ.100 కోట్లు మేర లబ్ధిచేకూరిందన్నారు. రైతన్న తన పంటను అమ్ముకునే విషయంలో నష్టపోకూడదని రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారన్నారు. ప్రకతి వైపరీత్యాలు సంభవిస్తే.. తోడుగా నిలబడేందుకు మరో రూ.2 వేల కోట్లతో ప్రకృతి వైపరీత్యాల నిధిని ఏర్పాటు చేశారన్నారు. జీవన రేఖ కార్యక్రమం ద్వారా వ్యవసాయ రంగంలో నష్టపోయి ఇబ్బందులు పడుతున్న రైతుల్లో మనోధైర్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతుల చెంతకు చేర్చాల్సిన బాధ్యత వ్యవసాయ ఉద్యోగులు, ఆర్‌బికె సిబ్బంది, వ్యవసాయ సలహా మండలి సభ్యులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ పద్మజ, ఏవో శశికళ, హెచ్ఓ నెట్టికంటయ్య, ఏఈవో భరత్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నార్పల : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎఒ ముస్తఫా ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జీవన రేఖ హెల్ప్ లైన్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్ వ్యవసాయ అధికారి ముస్తఫా ఉద్యాన అధికారి ఫజులున్ బేగం, రైతులు లక్ష్మిరెడ్డి, వెంకట రాముడు, ఎంపీటీసీ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నందు ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎఒ పృథ్వీసాగర్ మాట్లాడుతూ రబీలో రైతులు పండించిన ప్రతి పంటనూ ఈక్రాప్ చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు పిఎం కిసాన్ ఇకెవైసి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, జెడ్పిటిసి మమత, సింగిల్ విండో అధ్యక్షులు శివలింగప్ప, తహశీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఉద్యాన అధికారి ధనుంజయ, ఎంఐఎఒ మల్లేష్, ఏఈవో భాగ్య, నాయకులు త్రిలోక్‌రెడ్డి, రమేష్, ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఎంపీపీ దాసరి సునీత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సలహా మండలి ఛైర్మన్ పెద్దకొండయ్య, జడ్పీటీసీ నీలం భాస్కర్, సర్పంచి పార్వతి, ప్రత్యేక అధికారులు శ్రీమన్నారాయణ, సలహామండంలి సభ్యులు పిన్నేశ్వరి, కొండారెడ్డి, రేకులకుంట లక్ష్మీనారాయణ, పశు వైద్యాధికారి పెద్దన్న, విద్యుత్ ఇంజినీర్ ప్రతాప్, ఉద్యానాధికారి శైలజ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సైఫుల్లా బ్రిడ్జికి నూతన శోభ

నగర మేయర్ మొహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరానికి నూతన శోభను తీసుకువచ్చేలా సైఫుల్లా బ్రిడ్జిని తీర్చిదిద్దుద్దామని నగర మేయర్ మొహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. నగరంలోని సైఫుల్లా బ్రిడ్జిపై జరుగుతున్న పెయింటింగ్ పనులను నగర మేయర్ వసీం శుక్రవారం పరిశీలించారు. రంగు వెలిసిపోయి ఉన్న సైఫుల్లా బ్రిడ్జిని రూ.4.20 లక్షల వ్యయంతో పెయింటింగ్ తోపాటు వాల్ ఆర్ట్ పనులను చేపడుతున్నట్లు మేయర్ పేర్కొన్నారు. రిపబ్లిక్ దినోత్సవం నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని 10వ డివిజన్‌లో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడాన్ని పరిశీలించిన మేయర్ త్వరితగతిన చెత్తను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా కార్యక్రమాలలో కార్పొరేటర్లు గురుశేఖర్ బాబు, అనిల్‌కుమార్ రెడ్డి, ఇషాక్. తదితరులు పాల్గొన్నారు.


పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం తదితరులు


శిల్పారామంలో భోగిమంటలకు సిద్ధం చేసిన కట్టెలు

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

అనంతపురం : స్థానిక శిల్పారామంలో సంక్రాంతి నేపథ్యంలో మూడు రోజులపాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం భోగి రోజున అమృత కూచిపూడి నత్య కళా నిలయం అనంతపురం బృందం జానపద, కూచిపూడి నత్య ప్రదర్శన, ఆదివారం సంక్రాంతి రోజున యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, సోమవారం కనుమ రోజున చిన్నారుల గాలిపటాల ఎగరవేత వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. భోగి నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం భోగిమంటలతో సంక్రాంతికి స్వాగతం పలికినట్లు తెలిపారు. ప్రతిరోజు జరిగే సాయంత్రం వేడుకల్లో పాల్గొని శిల్పారామంలో అందుబాటులో ఉంచిన కొండపల్లి బొమ్మలు, జనపనార సంచులు, చార్మినార్ గాజులు, లక్క గాజులు, రాతి కంకణాలు, ఇక్కత్ బాగ్స్ తదితర చేతిబోతులచే ఏర్పాటు చేసిన వస్తువులు కొనుగోలు చేసి ఆదరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-యాడికి

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘన యాడికి మండలం పుప్పాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు వున్నారు. రెండవ కుమారుడు అశోక్‌కుమార్ (22) పదవతరగతి చదువుకుని ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయం పనులు చూసుకుంటున్నాడు. గురువారం రాత్రి తమ వ్యవసాయ పొలంలో బెండ పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మోటార్ స్టాటర్ బాక్స్ వద్ద ఉన్న కరెంట్ తీగలపై పడి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించారు. శుక్రవారం ఉదయం అశోక్ తల్లిదండ్రులు అల్పాహారం తీసుకుని తోటకు వెళ్లి కుమారున్ని పిలిచారు. ఎంత పిలిచినా పలకకపోవడంతో తోటలో పరిశీలించారు. మోటారు స్టార్టర్ వద్ద విగతజీవిగా పడివున్న కుమారున్ని చూసి బోరున విలపించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శింగనమల ఎస్ఐగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ


ఎస్ఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా డి శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై శింగనమల పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయన సిఐ అస్రార్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాయలసీమ ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

సంక్రాంతి పండుగ సందర్భంగా రాయలసీమ సంస్కృతి, జీవన స్థితిగతుల ప్రతిబింబించే విధంగా తమ ఇళ్లముందు ముగ్గులు వేసి రాయలసీమ ముగ్గుల పోటీలో పాల్గొనాలని రాయలసీమ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి, సభ్యులు రవికుమార్, వాసంతి, నిర్మల, సునీతలు కోరారు. 15వ తేది సాయంత్రం 5 గంటలలోగా రాయలసీమ ముగ్గుల ఫొటోలను 9962544299 వాట్సప్ నెంబరుకు పంపాలన్నారు. విజేతలకు నగదు బహుమతి అందచేస్తామని తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు

ఉరవకొండ : ఉరవకొండ మండల పరిధిలోని వెలుగొండ గ్రామంలో సర్పంచి వీరాంజనేయులు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీల్లో ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టి వీదిలైట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన చేపట్టారు.

నార్పలలో ఫ్రైడే... డ్రైడే..

ప్రజాశక్తి-నార్పల

నార్పల మండల కేంద్రం, చామలూరు, బొందలవాడ, సిద్ధరాచర్ల బి.పప్పూరు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ డి. ఓబులు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈవోఆర్డీ లక్ష్మీనరసింహ, వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, సిహెచ్ఒ పుల్లయ్య, ఎంపిహెచ్ఎలు అక్కులప్ప, మునిరెడ్డి, శ్రీరాములు, రాయుడు ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-నార్పల


నార్పల మండల కేంద్రంలోని వికలాంగుల కాలనీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ దుర్మార్గాలను, పెరిగిన ధరల గురించి వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎర్రినాగప్ప, జిల్లా తెలుగు యువత కార్యదర్శి చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు లక్ష్మినారాయణ, బండ్లపల్లి కుళ్లాయప్ప, యూనిట్ ఇన్‌ఛార్జి నాగేష్, టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వడ్డే మహేష్, బూత్ కన్వీనర్‌లు గణేష్, హరి, తలారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ దేవర మహోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఉరవకొండ

రేణుమాతులపల్లి గ్రామంలో ఈ నెల 17వ తేదీన జరిగే శ్రీ మారెమ్మ దేవత దేవర మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను చేపట్టినట్లు సర్పంచి బోయ రామాంజనేయులు తెలిపారు. దేవర సందర్భంగా గ్రామానికి తరలివచ్చే వారందరికీ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగానే జెసిబి సహాయంతో కంపచెట్లు తొలగించి వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

దేవాదాయ శాఖ సలహాదారు శ్రీకాంత్‌కు సన్మానం


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం


ప్రజాశక్తి-గుత్తి

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌కు ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానం చేశారు. అనంతపురం నగరంలో ఉన్న శ్రీకాంత్‌ను నాయకులు కలిశారు. శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధీంద్రనాథ్, బసినేపల్లి నాయకులు కరణం రమణారావు, రూపసాగర్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని ఎంపిడిఒ సునీత ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె ఇళ్ల నిర్మాణాలు, పెండింగ్ బిల్లులపై సిబ్బందితో చర్చించారు. లబ్ధిదారులకు సిమెంటు, కడ్డీలు, ఇసుక, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి ఇంటికీ ట్యాగ్ చేసి బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ ఏఈ రాజశేఖర్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ సునీత